క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలధారణ



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం గురుస్వామి కాశీపతి ఆధ్వర్యంలో 35 మంది అయ్యప్ప మాలధారణ చేశారు. వీరు 41 రోజులపాటు అయ్యప్ప దీక్షలో ఉండి జనవరి 2న మహా ఇరుముడి కట్టుకొని, అయ్యప్ప స్వామి దైవదర్శనానికి వెళ్తారని గురుస్వామి తెలిపారు.

స్వర్ణ కవచ పంచలోహ శివలింగం ప్రతిష్ఠ



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో గల శ్రీకోటిలింగేశ్వర దేవస్థానంలో నిర్మించిన ధ్యాన మందిరంలో బుధవారం నవరత్నలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం గబ్బూరు మఠాధీశ్వరులు బూదిబసవేశ్వరశివాచార్య మహాస్వామి, నేరేడుగం మఠాధీశ్వరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచలోహ శివలింగం, మహాగణపతి, దక్షిణామూర్తి, స్వర్ణకార్యణ భైరవమూర్తి, నందీశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్వామివారు హోమక్రతువును పూర్తి చేసి, పూర్ణాహుతి సమర్పించి, శివలింగానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి మహామంగళహారతి సమర్పించారు.

ఎస్సీ హాస్టల్ విద్యార్థి ప్రతిభ



మదనాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం, సంగారెడ్డిలో ఈ నెల 7న నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ అండర్–17 హాకీ పోటీలో మదనాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థి శంకర్ తృతీయ బహుమతి సాధించాడు. దీంతో వార్డెన్ బెనహర్ విద్యార్థిని అభినందించారు. రానున్న రోజుల్లో చదువుతో పాటు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

‘ఆరు గ్యారెంటీలు మాకొద్దు’



ఆత్మకూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు వద్దని, విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు ఇవ్వండి అంటూ ధర్మసమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి అందక, భూమి, ఇళ్లు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యమంత్రి స్పందించి ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ధర్మసమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు ఎనుముల శశి, సాయికుమార్, స్టీఫెన్, యుగంధర్, జాన్, లోకేష్, అనిల్‌కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు స్వాగతం



కొత్తకోట రూరల్: మాజీ మంత్రి హరీష్‌రావు కురుమూర్తిస్వామిని దర్శించుకునేందుకు వెళ్తుండగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కొత్తకోట బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. స్థానిక చౌరస్తాలో నిలబడిన బీఆర్‌ఎస్ నాయకులను హరీష్‌రావు కలిశారు. అక్కడి నుంచి స్థానిక బీపీఆర్ గార్డెన్‌లో జరుగుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అస్కని శ్రీనివాసులు కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. అనంతరం అక్కడి నుంచి కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వామన్‌గౌడ్, గుంత మౌనిక, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, చెన్నకేశవరెడ్డి, విశ్వేశ్వర్, కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, రాములుయాదవ్, గాడీల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



జమ్మాపూర్‌లో ధాన్యం కాంటా చేస్తున్న విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, నాయకులు

ఆత్మకూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దార్ చాంద్‌పాష అన్నారు. బుధవారం దేవరపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ధాన్యం సేకరించాలని, రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ నరేష్, రైతులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దార్ సుగుణ అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం ఆమె డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్‌తో కలిసి ఖిల్లాఘనపురం, వెంకటాంపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అక్కడ ఉన్న రైతులు, కొనుగోళ్లు చేపడుతున్న సింగిల్‌విండో కార్యాలయ సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని రైస్‌మిల్లులను పరిశీలించారు. ప్రతి రోజు ధాన్యం తేమను పరిశీలించి కొనుగోళ్లు చేపట్టాలని ఆమె సిబ్బందికి సూచించారు. మండలంలో 6 రైస్‌మిల్లులకు ధాన్యం తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు.

పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సింగిల్ విండో వైస్ చైర్మన్ కుర్వబాలయ్య, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి, జమ్మాపూర్ గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సీఈఓ భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచ్ చెన్నమ్మ, రోశయ్యనాయుడు, సురేష్‌శెట్టి, భాస్కర్‌రెడ్డి, రాజు, విండో సిబ్బంది మాధవ్‌రావు, సహదేవ్, రైతులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..



దేవరపల్లిలో..

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

అమరచింత: గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎన్నో విధాలుగా ఉపయోగపడుతాయని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని మస్తీపురంలో బుధవారం సీసీ కెమెరాల ఏర్పాటు గురించి ప్రజలతో పాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులతో కలిసి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు గ్రామంలోని నలు మూలల ఉంటే రాత్రి వేళలో అపరచిత వ్యక్తుల వల్ల కలిగే అనర్థాలను గుర్తించడమే కాకుండా చోరీలు, నేరాలను నియంత్రించే అవకాశం ఉందన్నారు. గ్రామ ప్రజలు సమిష్టిగా కలిసి వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తర్వాత వాటిని పోలీస్ స్టేషన్ నుంచే మానిటరింగ్ చేస్తూ నేరాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కురుమన్న, మల్లారెడ్డి, రాజు పాల్గొన్నారు.

కలెక్టర్ ఇంట్లో సమగ్ర సర్వే..

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే బుధవారం కలెక్టర్ బంగ్లాలో నిర్వహించారు. సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్ గోవింద్‌కు కలెక్టర్ ఆదర్శ్ సురభి తన స్థిర, చరాస్తులు, వార్షిక ఆదాయం తదితర వివరాలు వెల్లడించారు.



మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన

కొత్తకోట రూరల్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పెద్దమందడి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం 2012, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006, చైల్డ్ లేబర్ యాక్ట్, మాదకద్రవ్యాల వినియోగం, బాలల అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ అతి వినియోగం వల్ల యువత ఎదురయ్యే సమస్యల గురించి వివరించారు. చిన్న వయసులో వివాహాలు, చదువు మాన్పించడం వల్ల పిల్లల భవిష్యత్తుపై పడే ప్రభావం అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది శ్రీవాణి, సలోమి, సాయిలీల, స్థానిక పోలీస్ సిబ్బంది, కేజీబీవీ ఎస్‌ఓ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది

కస్తూర్బా విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ

వీపనగండ్ల: క్రీడల్లో ప్రతిభ కనబర్చి గెలుచుకున్న నగదు బహుమతితో క్రీడాకారులు మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలకు క్రీడా సామగ్రి, డ్రమ్స్‌ను వితరణగా అందజేశారు. దీపావళి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో నిర్వహించిన వీపీఎల్ 4వ క్రికెట్ టోర్నమెంట్‌లో మండల కేంద్రానికి చెందిన వారియర్స్ టీం విజేతగా నిలిచింది. టీం సభ్యులు వారికి ఇచ్చిన నగదు బహుమతితో కస్తూర్బా పాఠశాల బాలికలకు ఉపయోగకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో క్రీడా సామగ్రిని అందజేశారు. సామగ్రి అందజేసిన క్రీడాకారులకు బాలికలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీం కెప్టెన్ మదుగని నరేష్, పాఠశాల ఎస్‌ఓ, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని అందజేస్తున్న క్రికెట్ టీం సభ్యులు

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తులకు జరిమానా

వీపనగండ్ల: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో బుధవారం వనపర్తి ఫస్ట్ అడిషనల్ న్యాయమూర్తి శ్రీలత వల్లభాపురంతండాకు చెందిన సబావత్ లక్ష్మణ్‌కు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్‌కే రాణి, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ తెలిపారు. వల్లభాపురం నుంచి సంగినేపల్లికి వెళ్తున్న సమయంలో నిర్వహించిన తనిఖీలో లక్ష్మణ్ మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు రుజువైందన్నారు. వాహనదారులు చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

పాన్‌గల్: మండలంలోని కొత్తపేట స్టేజీ సమీపంలో ఈనెల 19న సాయంత్రం ఎస్‌ఐ శ్రీనివాసులు తన సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తుండగా.. కొత్తపేట గ్రామానికి చెందిన పుంటుకూర రవి మద్యం తాగి ద్విచక్ర వాహనాన్ని నడిపి పోలీసులకు పట్టుబడ్డాడు. అనంతరం అతడు పోలీసులతో దురుసుగా ప్రవర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. బుధవారం పుంటుకూర రవిని వనపర్తి కోర్టులో హాజరుపర్చగా నిందితుడికి న్యాయమూర్తి రూ.1000 జరిమానా విధించారు.

సర్వేకు ప్రజలు సంపూర్ణంగా సహకరించాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆత్మకూర్ మండలంలో ముమ్మరంగా కొనసాగుతుందని, ఇప్పటివరకు 80 శాతం పూర్తయ్యిందని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 6,231 కుటుంబాలు, మున్సిపాలిటీలో 3,400 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఈ నెల 25లోపు సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఏఓ వినయ్‌కుమార్, డీటీ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

90 శాతం పూర్తి

పాన్‌గల్: మండలంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ఇప్పటికి 90 శాతం పూర్తైనట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండాలో సర్వే వివరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 జీపీల్లో 602 ఇండ్ల నుంచి ఎన్యుమరేటర్లు వివరాలను సేకరించారన్నారు. దీంతో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లోని రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి, జీపీ రికార్డులను పక్కాగా నమోదు చేయాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నీలమ్మ, కుర్మయ్య పాల్గొన్నారు.

త్వరగా పూర్తి చేయాలి

వనపర్తి రూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రాఘవ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని పెద్దగూడెంతండాలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచే విధంగా భోదన సాగించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రేణుక, హెచ్‌ఎం పాల్గొన్నారు.

విద్యార్థులు దేశం గర్వించేస్థాయికి ఎదగాలి

ఆత్మకూర్: విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని, బాలలకు ప్రాథమికంగా స్వేచ్ఛ, విద్య, జీవించడం, రక్షణ, అభివృద్ధి హక్కులు ఉంటాయని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. బుధవారం బాలకిష్టాపూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ హక్కులను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బాలల హక్కులకు భంగం కలిగించినా, బాల కార్మికులను పనిలో పెట్టుకున్న, బాల్యవివాహాలు చేసిన, వేధింపులకు గురిచేసిన 100, 1098 కాల్‌సెంటర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తోటివిద్యార్థులను ర్యాగింగ్ పేరిట అవమానాలకు గురిచేసిన, దాడులకు పాల్పడ్డ, ఆత్మహత్యలకు ప్రేరేపించిన, నిర్బంధాలకు గురిచేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఇంటర్‌నెట్ వినియోగం పెరిగిన తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లారూరల్ డెవలప్‌మెంట్ సభ్యులు హరికృష్ణ, ఆర్డీఎస్ ఇన్‌చార్జ్‌లు రామకృష్ణ, రజనీకాంత్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సునీత, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని శాగాపూర్ సబ్‌సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు, వ్యాధి నిరోధక టీకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనలు పాటించాలన్నారు. గర్భిణులకు ఐరన్, కాల్షియం మాత్రలు పంపిణీ చేయాలని, రక్త శాతం పెరగడానికి రోజు తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పౌష్టికాహారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమిత్ర, జయలక్ష్మి, ఆశ కార్యకర్తలు లలిత, యాదమ్మ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆఫీసర్ రామయ్య

ప్రమాదాల నివారణ.. అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

• ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని రావూస్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడంతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. జిల్లాలో చాలామంది వాహనదారులు తమ వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండానే నడుపుతున్నారని.. అది చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనాలపై ప్రెస్, పోలీసు పేరిట స్టికర్లు పెట్టుకునే వారిని గుర్తించేందుకు త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని.. విద్యార్థులు సెల్‌ఫోన్ల వినియోగం తగ్గించి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ఎం.కృష్ణ, ఎస్‌ఐ హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్‌ఐ సురేందర్, ట్రాఫిక్ ఏఎస్సై నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి జైలుశిక్ష..

వనపర్తి రూరల్, అమరచింత పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ.. బుధవారం రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వై.జానకి తీర్పునిచ్చారు. ఒక్కొక్కరికి మూడురోజుల జైలుశిక్ష విధిస్తూ భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించినట్లు ఆయా పీఎస్‌ల ఎస్‌ఐలు తెలిపారు.

క్రీడాసామగ్రి అందజేసిన శాట్ చైర్మన్

జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని క్రీడా మైదానాన్ని బుధవారం శాట్ చైర్మన్ శివసేనారెడ్డి పరిశీలించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొంత కాలంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీల గురించి తెలుసుకొని క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాశ్రేయస్సు కోసం పనిచేసే పోలీసులు ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం వ్యాయామం చేయడంతో పాటు క్రీడలపై ఆసక్తి చూపించాలన్నారు. క్రీడా మైదానం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎస్పీకి సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ రావుల గిరిధర్, డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, సాయుధదళ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పలనాయుడు ఉన్నారు.

గోశాల నిర్మాణానికి భూమిపూజ

కొత్తకోట రూరల్: దాసోహం కోసలేంద్రశ్య సంస్థ వారి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం గో సంరక్షణ కోసం మండలంలోని కానాయపల్లి శివారులో గల గుంపు గట్టు వద్ద నూతనంగా నిర్మించ తలపెట్టిన గోశాల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. దాసోహం కోసలేంద్రశ్య సంస్థ వారి ఆధ్వర్యంలో గోశాల నిర్మాణం చేపడుతున్నారని, గోశాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో దాసోహం కోసలేంద్రశ్య సంస్థ వ్యవస్థాపకులు ఆచార్య అర్చకం శ్రీకాంతాచార్యులు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, బాజ గిరన్న, గొల్ల చిన్నరాములు, బోయ రవి, రామన్‌గౌడ్, తోకలి వెంకటయ్య, కరాటే శివ, గాంధీ, బైండ్ల రవి, రాజు నాయక్ తదితరులు ఉన్నారు.



భూమిపూజ చేస్తున్న అర్చకులు శ్రీకాంతాచార్యులు, గ్రామస్తులు

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేయాలి

పెబ్బేరు రూరల్: ముదిరాజ్‌లకు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత అందించాలని ముదిరాజ్ మహాసభ సంఘం సీనియర్ నాయకుడు గోనెల బాలస్వామి ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో పెబ్బేరు పట్టణంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ప్రతి గ్రామంలో జెండాలు ఎగురవేస్తూ సంబురాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి, ముదిరాజ్‌లకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అభ్యర్థించారు. ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మత్స్య కో–ఆపరేటివ్ ఫెడరేషన్‌కు వెంటనే ఎన్నికలు నిర్వహించి, చైర్మన్, పాలకమండలి నియమించాలన్నారు. కార్యక్రమంలో సొప్పరి బీచుపల్లి ముదిరాజ్, చింతకాయల కురుమూర్తి, సహదేవుడు, మహేష్, భీముడు, ఆనంద్, కురువన్న, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ముదిరాజ్ మహాసభ సంఘం నాయకులు

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూర్: శ్రీశ్రీ కోదండరామస్వామి వారి విగ్రహప్రతిష్ఠాపన పూజలను వేదపండితులు మూడో రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని బాలకిష్టాపూర్ శివారులోని శ్రీఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం శ్రీసీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. ప్రముఖ వేదపండితులు నర్సింహశాస్త్రి, సుబ్రమణ్యశాస్త్రి, నాగరాజు శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ప్రాతకాలపూజ, గర్తన్యాసం, సుష్కర్వసు నక్షత్రయుక్త ధనుర్లగ్న శుభపుష్కరాంశమునందు యంత్రప్రతిష్ఠ, కూష్మాండబలి, చక్షాగ్నిజ్వాల, బలిదానం, మహాపూర్ణాహుతి, కలశోద్యాసన, కలశజలమార్జన, ఆశీర్వచనం తదితర పూజలు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గాడీ లక్ష్మీనారాయణ, అరుణ, మాజీసర్పంచులు సత్యన్న, తుకరాంనాయక్, నిర్వాహకులు మాసన్న, చిరంజీవి, గాగ్యనాయక్ ఉన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

వనపర్తి విద్యావిభాగం: విద్యార్థులు అక్షరజ్ఞానం పెంపొందించుకుంటే వ్యక్తిత్వం వికాసిస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. విజ్ఞానం సముపార్జించుకునేందుకు విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి 57వ స్మారక గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా వ్యాసరచన, ఉపన్యాసం, ముగ్గుల, చిత్రలేఖనం తదితర పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం జిల్లా గ్రంథాలయంలో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌సాగర్ మాట్లాడుతూ విద్యార్థులను శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పేరుతో స్మార్ట్ ఫోన్లకు అలవాటు చేయడం సరికాదన్నారు. విద్యార్థుల్లో ఆలోచన శక్తి, సృజనాత్మకత పెంపొందించేందుకు పుస్తక పఠనమే ఏకైక మార్గమని అభిప్రాయపడ్డారు. పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా విద్యార్థులు ప్రతి రోజు స్ఫూర్తివంతమైన, విభిన్న ఆలోచనలు కలిగిన, మహనీయుల పుస్తకాలను చదవడం అలవాటు చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎండీ జబ్బార్, జయరాములు, ఉపాధ్యాయులు రమాదేవి, రంగన్న, రుక్మోద్దీన్, లైబ్రేరియన్లు శ్రీనివాసులు, వెంకటేశ్వరమ్మ, చైతన్య, సిబ్బంది చెన్నయ్య, ఇక్బాల్, ఆంజనేయులు, తాజ్‌లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవర్ధన్‌సాగర్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి ఎ. గణేష్ కుమార్ - 91605 62261
కొత్తకోట / పెబ్బేర్ ఇ. రాజశేఖర్ గౌడ్ - 97000 09392
టోల్ ఫ్రీ నెం. : 1800 270 1003

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొందత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్
9951602829
జబ్బర్ లాల్ : 9553955603